# అంతా మన స్వంతమే

''వేదాంతులొచ్చేరు. ముంతలు దాచుకోండి'' - అని మనవాళ్లు అంటూంటారు చూడండి! - సర్వసంగ పరిత్యాగులయిన వేదాంతుల్లో కూడా ''నీది - నాది ఏమిటి నాయనా? అంతా మనదే!'' అని ప్రవర్తించే వాళ్లు వుండబట్టే!

సన్యాసి బూడిద రాసుగు వచ్చి, ఆతిథ్యం స్వీకరించి (తాగటానికి ముంత, పడక్కి కంబళి - మర్యాద కోసం యిచ్చేసరికి - వాటిని ఆ స్వామి - తనకి ప్రీత్యర్థం ఇచ్చినట్టే లెఖ్ఖ వేసుకొని; వెళిపోతూన్నపుడు చంకని బెట్టుకు చక్కా బోతే ఏం చేస్తాం?

ఇలాటి మనస్తత్వం గల వాళ్లు మన కళ్లెదుట - ప్రతి దినం - ఉద్యోగుల్లోనూ, స్నేహితుల్లోనూ, యింటికొచ్చే చుట్టాల్లోనూ, కథలూ, కార్యాల్లోనూ, ప్రయాణాల్లోనూ, కళాకారుల్లోనూ, పోస్టాఫీసులు, కోర్టులూ, యిలా ఎక్కడ పడితే అక్కడ అన్ని రంగాల్లోనూ తారస పడుతూనే వుంటారు.

కొందరు ఒక వస్తువులనే తమ స్వంతంలా వాడుకుంటే - మరి కొందరు మనుషుల్ని కూడ తమ స్వంతం కింద వాడుకోడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

మా ఆఫీసులో ఒకాయన వున్నాడు. అతగాడు - ఆఫీసుకి వచ్చిన దగ్గర్నుండి - ఎవడయినా ఎర దొరుకుతాడా, ఏదో చెప్పి పని అంటగడదామా? అని చూస్తాడు.

''న్నాయన్నాయనా! యీ పని చేసి పెడుదూ! నీకడుపున పుడతాను!'' అని బ్రతిమాలుకుని అయినా ఆ పని చేయించుకు తీరుతాడు. ''ఈ కూడిక సరిపోయిందో లేదో ఒక్కసారి నువ్వు చూసెయ్యవోయ్... నేనూ చూశాననుకో.. అయినా, అనుమానం తీరిపోతుంది!'' - అని తను చేయకుండానే ఇతరుల చేత చేయిస్తాడు - తను కాలయినా కదపకండా కావలసినవన్ని తెమ్మంటూ బంట్రోతుల్ని చంపుతాడు.

మామూలు వాళ్ళ సంగతే యిలా వుంటే యింక పెద్ద పెద్ద అధికారులు కొందరు తమ క్రింద పని చేస్తున్న వారిని విసిగిస్తూ తమ యింటి పనులని కూడా, భయ పెడుతూ బలవంతాన్ని చేయిస్తూ వుంటారు- వాళ్లు తమ స్వంత మనుషుల్లా.

కొందరయితే - ''ఓయ్ - నాకివాళ చిన్నపనుంది..... రాలేను. నా పని కాస్త నువ్వు చూసి పెడుదూ! ఎప్పుడయినా నీ అవుసరం తీరుస్తాలే!'' అని. యింక తప్పదుగాక తప్పదని అప్పటికి పని చేయించుకుని, ఆ మనిషిని తన పనికి ఉపయోగించుకొని, మన అవుసరానికి- ఏదో కారణం చెప్పి - తప్పుగుంటారు.

కాగితాలూ, సిరా, పాళీలూ, అల్పీలూ, పుస్తకాలూ యిలాటి ఆఫీసు సప్లయి - ఏవో తప్పుడు లెక్కలు చూపెట్టి, అవన్నీ తనుస్వంతమే అయినట్టు యింటికి చేరవేసి స్వంతానికి వాడుకొనే ఉద్యోగస్థులు కొందరున్నారు. ఇవేగాక, ఆఫీసూ యిల్లూ దగ్గిరగానే వున్నట్టయితే, కుర్చీలూ, బెంచీలూ, అవసరానికి స్వంత వస్తువుల్లా వాడుకోడం సాధారణం.

బేంకులూ, ట్రెజరీలూ, యిలాటి డబ్బుతో సంబంధం గల ఉద్యోగులయితే - ఆ డబ్బునే-స్వంత డబ్బుగా ఖర్చు చేస్తూ జేబులో వేసుకుంటూ అటుదిటూ ఇటుదటూ తారిగిళ్ళు మారిగిళ్ళు చేస్తూ వుంటారు కొందరు. ఒసిలిపోయినన్ని రోజులు ఒసిలిపోతాయి. ఎటుంచి ఏది వచ్చినా సంగతి తెలిసిపోయిన సమయానికి కారణం చూపలేక పారి పోయినవారిని- ఎంతమందిని చూడటం లేదూ?

కొంచం పరీక్షగా చూస్తే మన యిళ్ళ కొచ్చే ఘట్టాల్లో కూడా ఇలాటి వాళ్ళు కనబడుతూనే వుంటారు.

వచ్చీరావడంతోనే - ఎంతో చనువు ప్రదర్శిస్తూ ఇంట్లో - అందరినీ ఏవో వరుసలు కట్టి పిలుస్తూ, ''నాకు మొహమాటం లేదు సుమండీ!'' అని అంటూనే అనవసరంగా అన్నిట్లో కలిపించుకొని వాగుతూ, సరాసరి పడకగదిలోనే, మకాం పెడతారు.

రావడంతోనే కూలివాడిని నిలబెట్టి - పర్సుతీసి - ''పది రూపాయల నోటుకి చిల్లరుందీ?'' అని కూలి వాడిని అడుగుతాడు. వాడి బ్రతుకనగా ఎంత? పది రూపాయల చిల్లరే వాడి దగ్గర వుంటే-కూలి చేస్తాడా?... వాడు ''లేదు బాబూ'' అంటాడు - ( అలా అనడమే అతనికి కావలసింది)

అలా అనగానే - మనల్ని ఉద్దేశించి -

''ఏంరా! ( వీళ్ళు ఎవరినయినా ఒరే అనే సంబోధిస్తారు! ఏదో అభిమానం, చనువు వున్నట్టు) ఓ పదణాలు చిల్లరుంటే వాడి కిచ్చి పంపేయి. తర్వాత మార్చి యిస్తాను! వెధవది ఎప్పుడూ యీ చిల్లరతో గొడవే - '' అని కేవలం తన దగ్గర లేకే విసుక్కుంటున్నట్టు నటిస్తాడు.... యింక - చచ్చినట్టు మన జేబులోంచి వాడి స్వంత ఖర్చుకు యివ్వక తప్పదు.

అది మొదలు గడ్డం తడువుకుంటూ -

''ఇక్కడ దగ్గరగా మంగలి షాపు వుందీ?... ఊం... పోనీ... ఆలస్యం... నీ రేజర్ సెట్టు యిలా పడేద్దూ! ఏమిటో.. తొందరలో ... మరిచి పోయాను!''

అని అర్జంటుగా మనం ఆహ్వానిస్తేనే వచ్చినట్టు.. అంటూ ఆ పని కానిచ్చి - దండెం మీద తువ్వాలూ, సబ్బు పెట్టె, వాసన్నూనే - తనే తీసుగొని - వంట పొయ్యి దగ్గర కొచ్చి-

''అమ్మాయీ! ఆ ఎసట్లో మరుగు నీళ్ళు కాస్త చెంబుడు యిలా పోసేయమ్మా!.. చన్నీళ్ళు పడవు!'' అంటాడు.

ఇలా అడుగుతూన్న ఆసామిని చూసి ''అయ్యో, ఒక్క క్షణం వుండండి. వేన్నీళ్లు మీ కోసం కాగ బెట్టాను!'' అని అనక తప్పదూ, కాగబట్టి యివ్వకనూ తప్పదు. అతడు హాయిగా అభ్యంగన స్నానం ముగించి, తర్వాత ఘట్టంలోకి వస్తాడు.

''అమ్మాయీ! నాకోసం అట్టే శ్రమపడకు.. ఏదో మీతో పాటే - స్పైవాణ్ణేం కాదు! యిందాకా

బీరకాయలు తెస్తున్నట్టు చూశాను? ఆ కూర మాత్రం చెయ్యకమ్మా! పడదు!'' అని భోజనం కూడా యిక్కడే సుమా అన్నట్టు చెప్పేస్తాడు! ఏమిటో అతడిని మనం పంచ భక్ష పరమాన్నాలూ చేసి తినమని బ్రతిమాలుకుంటున్నట్టు.

చక్కా సుష్టుగా భోంచేసి - బ్రేవ్‌మని త్రేనుస్తూ - భుక్తాయాసంతో -

''ఒక్కసారి నడుం వాలిస్తేనే గాని ..'' అని అంటూ సరాసరి మంచం మీదే పవ్వళించి..

''ఒరే! ఆకులూ, వక్కలూ, సంగ్రహం లేవ్రా! అయినా నే వస్తానని కలగన్నానా ఏమిట్లే! పోనీ... రెండు మీఠా కిళ్లీలు తెప్పిస్తూ!'' అని సావకాశంగా అంటాడు! అవి తెప్పించాక రెండూ ఒకేసారే కబళించి - గుర్రు పెట్టి నిద్దరోతాడు!

ఇంకా ఏదీ, మరో మంచం వేసి పడుకోమని చెప్పే ముందే యింత పనీ చేసేసరికి మనసులు [illegible] మనవా? అయినా ఏం? అతగాడికి తెలుసు - ఏదో నులక మంచం మీద బొంత గుడ్డ వేసి పడుకోమంటారని. అందుకే ముందరే మెత్తని పందిరి మంచం కోసం జాగ్రత్తపడతాడు మరి.

ఇంక రాత్రి ఏ మాత్రలో మింగుతూ -

''అమ్మా! యిదో సంకటం! ఏం చెప్పనూ ఏణ్ణర్థం అయింది! రాత్రి అన్నాహారం పడదు కదా, అన్నం తిన్నానా, కడుపునొప్పి! రొట్టెలూ, పాలూ, పళ్ళూ, యిదీ పత్యం; కాస్త ఏర్పాటు చేయిస్తూ! అహా! శ్రమేం పడొద్దు. లేకపోతే మంచి తీర్థం తాగి పడుకుంటాలే!'' అని లౌక్యంగా అంటాడు. యిహ ఇంటికొచ్చిన పెద్ద మనిషిని అభోజనం పడుకోమంటామా? భగవంతుని మొక్కయినా యిప్పుడు కాదని ఎగవేయవచ్చు గాని యీ ప్రత్యక్ష దయ్యం కోర్కె వెంటనే చెల్లించుకుంటాం. ఇంతకీ చెప్పొచ్చే దేమంటే అంతలా అడిగి మరీ స్వంత యింట్లోలా చేయించుకుని తింటాడు. అక్కడితో వూరుకుంటాడా?

భోజనం చేస్తూ ''ఒరే! నీకు తెలీదు గానీ పిన్ని వంటలంటే మేం చెవి కోసుకుంటామనుకో. పులిహోర, పరమాన్నం మీ అమ్మ చేసినట్టు ఎవ్వరూ చెయ్యలేరనుకో! మేం రోజూ తలుచుకుంటూనే వుంటాం''

అని యిలా ఆ మర్నాటి మకాంని స్థిరపరుస్తూ 'ఇలా మామ్మూలుగా తినేసి వదిలేరఖం కానసి- అవన్నీ చేయించుకు తినడానికే వచ్చాను సుమా!' అని అన్నట్టు అంటాడు! పోనీ, అదేదో ఆ కోర్కె తీర్చేస్తే వదిలిపోతాడేమో అనేనా, అవి అన్నీ చేసి నైవేద్యం పెట్టక తీరదు కదా!

ఇంట్లో, రేడియోలూ, ఫోనులూ, వుంటే చెప్పనక్కర్లేదు - వాటికి ఆయువు మూడిందన్నమాటే.

ఈ విధంగా ఉన్నన్నాళ్ళూ, యిదీ అదీ అన్న విచక్షణ లేకుండా అంతా మన స్వంతమేలా ప్రవర్తించి- వెళ్లిపోతున్నప్పుడు కూడా -

''ఒరే! తెచ్చిందంతా అయిపోయింది - గుమ్మం దిగితే ఖర్చు. ఓ పది రూపాయలుంటే యిద్దూ... వెళ్ళగానే మనియార్డరు చేసేస్తాలే - నిన్ను కాబట్టే అడుగుతున్నాను!'' అని సత్య నిరతునిలా అడిగి పుచ్చుకొని - ఇంటికి వెళ్ళేక ఆ సంగతి మరచి పోతాడు.

స్నేహితుల్లో కూడా ఇలాటి రకం వాళ్ళు బోలెడు మంది వుంటారు.

''అర్జంటు పని వుంది. యిప్పుడే వస్తా!'' నంటూ సైకిళ్ళు పట్టుకుపోయి వారి స్వంత పనులన్నీ చూసుకొని వాళ్ళకు తీరికయినపుడు తెచ్చి యిస్తూ ''సారీ, కొంచం లేటయిపోయింది!'' అన్న ముక్కతో ముగిస్తారు.

పుస్తకాలూ, పెన్నులూ, వాచీలూ, యిలాటి వాటిల్లో భాగస్తులుగాని స్నేహితులెవరు? అవన్నీ ఎప్పుడో వారికి దయ కలిగేక మనకు ప్రాప్తమవుతాయి. యిక వాళ్ళెక్కడికయినా ప్రయాణమయినా మనకే ప్రమాదం. ఏమూలో వున్న మన హోల్డాలు మీద పడుతుంది. వాళ్ళదృష్టి, యిహ ఆ బెడ్డింగుకు అది అంతిమయాత్రే! వాటితో కూడా ఆ ప్రమాదానికిగురి అయేవి బేగ్‌లూ, పెట్టెలూను, నీటిని పట్టుకు వెళ్లే వాటిని పోల్చుకో లేకుండా చేసి, పోనీ కదా అని తిరిగి యిస్తారు!

ఆఖరికి తొడుక్కునే బట్టలుకూడా ఎరువు తీసుకుపోయి, స్వంత బట్టల్లాగే నాలుగు రోజులు వుపయోగించుకుని మరీ యిస్తారు; యీ విషయంలో చాకలివాళ్ల గొడవ చెప్పనవసరంలేదు కదా!

లాడ్జికివచ్చే స్నేహితులు సబ్బులూ, పౌడర్లు, స్నోలూ, జోళ్ళూ వుపయోగించుకోడం విశేషం ఏం కాదు. ప్రమాదకరమయిన కళ్ళ జోళ్ళు కూడా ఒకరివి తమ స్వంతం క్రింద ఉపయోగించుకుంటారంటే ఏమంత ఆశ్చర్యం కాబోదు!...

కొందరు తీసుకువెళ్ళే పుస్తకాల మీద వారి హక్కులా - అండర్ లైనులు చేసి, వ్యాఖ్యానాలు వ్రాయడం, పేర్లు వ్రాయడం, పేజీలు చింపివేయడం, బొమ్మలకి, మీసాలూ, బొట్లూ పెట్టడం- పెన్నులకి పాళీలు మార్చేయడం, యివన్నీ మామూలే! యిహః సిగరెట్ల విషయంలో - ఆ సిగరెట్టు పెట్టెని తమ స్వంతంగా చేసుకొని, అడిగినప్పుడు తిరిగి మనకే ఒక సిగరెట్టు యిచ్చే పరిస్థితి వస్తుంది.

మనకు తెలిసిన వాళ్ళ యిళ్లలో గాని, యిరుగు పొరుగుల ఇళ్ళల్లోగాని కథా కార్యాలూ జరిగితే, గిన్నెల దగ్గర్నుంచి, వెండి బంగారు, వస్తువుల వరకూ కూడా అడిగి బుచ్చుకొని వాడుకొని - అరగదీసి సొట్లు పెట్టి, తిరిగి - జాగ్రత్తగా ఇచ్చేస్తారు! వాటి స్వరూపాలకి మనం లోపల ఏడవ్వలిసిందేగాని - ఏమైనా అంటే ''మీరిచ్చినప్పుడే అలా వున్నాయండీ'' అంటారు. ఇంక అప్పుల పేరిట మనం కొనుక్కున్న సామానులను వారి అవుసరానికి వాడుకోడం రోజూ యింటింటా తెలిసినదే. అలాగని అందరూ కాదు సుమండీ!

మన యింట్లోనే కథాకార్యం అవుతే, చుట్టపు చూపుకి వచ్చిన పెద్దమనుష్యులు కొందరు తిరిగి వెళ్ళాక చీరలూ, వస్తువులూ, కనబడకపోడం - అందరికీ అనుభవమే. అవి వాళ్ళ స్వంత వస్తువుల్లా తీసుకుపోతారు! ఆహ్వానించిన వాళ్ళని అనుమానించి, సోదా చేయగలమా ? ఎవరా పని చేశారో తెలిసినా సరే, నోరు మూసుకు ఊరుకుంటాం! పల్లెత్తు మాటేనా అన్నామా ''యింటికి పిలిచి యిదా మర్యాద! మాకు దొంగతనం కడతారా ? ఇహ అక్కడికి మీరేనా ! నిజాయితీ గలవాళ్ళు , ఛీ - ఎంత అవమానం!'' అని అందుకుంటారు.

ప్రయాణాలు చేస్తున్నపుడు యిలాటివారిని బాగా కనిపెట్టవచ్చు ననుకుంటాను.

ముఖ్యంగా రైళ్ళలో రోజూ వందలకొద్దీ టిక్కట్లు లేకుండా ప్రయాణం చేస్తూంటారే! యీ

సోదరులందరూ ఆ రైలును తమ స్వంత బండీలుగా భావిస్తున్నవారే! మరి టిక్కెట్లు కొన్న వారికయితే విభేదంగా ని టిక్కెట్లు లేని మహానుభావుకి ఏ క్లాసు అయినా ఒకటే కదా ? టిక్కెట్లు కొనకపోడం కాదు కదా - టిక్కెట్లున్న వారికి కూడా చోటు లేకుండా ఆక్రమిస్తారు! అంతా వారి స్వంతమే కదటండీ!

ఎదురుగుండా చోటులేక ఆడవాళ్లతో - పిల్లలతో - గంటల తరబడి నిలబడి నానా అవస్థా పడుతున్నా సరే వాళ్ళు మాత్రం, తమకు కాదన్నట్టుగా కాళ్లు బార చాచుకొని, ఆ బెంచీ అంత ఆక్రమించుకుని వుంటారు. అంతేగాని - ఇంత పిసరూ ఒసిలి జాగా యివ్వరు. పట్టపగలయినా, ఆ రకం వాళ్లు అంతే - ఏమిటో ఆ స్థలం వారికి శాశ్వతం, స్వంతం అయినట్టు.

ఇంకొందరు తలుపులుబిడాయించి, పెట్టె పెట్టెంతా హక్కు చేసుకొని కాళీగా వున్నా యివతల తలుపులు బాదుతున్నా వినిపించుకోరు. తలుపు తియ్యకుండానే ''రిజర్వుడు'' అని వుత్తుత్తినే దబాయించేస్తూ వుంటారు. ఏమిటో ఆ పెట్టె వాళ్ళ స్వంత మయినట్టు.

మరి కొందరిని చూశారో లేదో - ఎలాంటి వారంటే, ఎక్కిందే తడువు కొంత ప్రదేశం ఆక్రమించుకొని అక్కడొక చిన్నగృహాన్ని నిర్మించుకుంటారు. సామాన్లని వంటింట్లోలా పేర్చేస్తారు. ఒక ప్రక్క పిల్లలకి వుయ్యాల్లు కట్టేస్తారు. మరో ప్రక్కని పెట్టెలూ, బట్టలూ, మూటలూ గోడల్లా పేర్చేస్తారు. కంపార్టుమెంటు నిండా బట్టలు ఆరేస్తారు. అన్నపానాదులూ, మలమూత్రాదులూ అక్కడే- యీగలు ముసురుతో - ఆరేసిన బట్టల మెతగవాసన, ఆవకాయి పచ్చళ్ళ ఘాటుతో, యిలా క్రొత్త రకం కంపుతో పెట్టె పెట్టంతా గుప్పు మంటుంది. తోటి ప్రయాణీకుల సంగతి వారి కక్కర్లేదు! ఆ బండిని వాళ్ళున్నంత సేపూ స్వంతంలా వాడుకొని, వెళ్ళిపోతున్నపుడు పాకీదొడ్డిలా చేసి వెళ్లిపోతారు.

మరోరకం మనుష్యులు, ప్రక్కని ఎవరి బెడ్డింగయినా తలగడా క్రింద ఉపయోగించుకొని సుఖనిద్రపోతారు. అక్కడితో ఆగినందుకూ, ఆ బెడ్డింగు పూర్తిగా పరుచుకు నిద్రపోనందుకూ మనం ధన్యవాదాలర్పించి వూరుకోవలసిందే.

ఒకసారి ప్రయాణంలో అప్పర్‌బెర్త్ మీద పడుక్కుందాం కదా అని బెడ్డింగు పరిచి క్రింద మా స్నేహితుడితో మాటాడుతున్నా. ఇంతలో చూస్తూండగానే ఒక ఆసామీ చటుక్కున ఎగిరి నా బెడ్డింగ్‌మీద పడుక్కొని కంటికి చెయ్యి అడ్డం పెట్టుకొని నిద్రకి ఉపక్రమించేస్తున్నాడు! ఈ అన్యాయాన్ని ఆశ్చర్యంతో చూస్తూ సహించలేకపోయాను. వెంటనే ''మిష్టర్, మిష్టర్!'' అని లేపేను, అతను లేవనేలేదు. కాని క్రిందనించి ''ఓయ్ పడుక్కోనివ్వవోయ్, వాడు నా తమ్ముడేలే! పెళ్ళికొడుకు. వాడి పెళ్ళినించే వస్తున్నాం. పాపం, వారం రోజులయి పెళ్ళి, శోభనం. అంచేత రెస్టులేదు. పర్వాలేదు. పడుక్కోనివ్వు!'' అని ఎవరో అన్నాడు! ఎవడా అని చూద్దును. వాడూ నా స్నేహితుడే! ఎంతో కష్టపడి, కూర్చుందికి సీట్ దొరకని ఈ రోజుల్లో, పడుక్కుందికి జాగా సంపాదించుకుంటే తెల్లవార్లూ జాగరం అయింది.

ఇంకొందరు పైవాళ్లు తెచ్చుకున్న పుస్తకాలని, పత్రికలని, వుచ్చుకు చదివేస్తూంటారు. కొనుక్కున్నవాడు, ఆ పుస్తకంగాని, మిగిలితే పట్టుకు వెళ్ళి యింటికి పోయి చదువుకోవలసిందే!

వాళ్ళకి మొదట ఇవ్వకపోయామూ మెడలు క్రిందకు వంచి చదవడం, నానా అవస్థ పడుతుంటారు. ఆ బాధ మనలాటి వాళ్ళం చూడలేక కనీసం - ఒక కాగితమయినా ఇచ్చేస్తాం. కాకపోతే సిగరెట్టు కంపుతోనో, ఖారాకిల్లీ కంపుతోనో, పొడుం వాసనతోనో, పోసి వాసనతోనో మొఖం మీద మొఖం పెట్టి చదువుతూంటారు; అంతకన్నా ఆ పత్రిక చదవకపోతే మానే! వాడి మొఖాన కొట్టి కాస్త గాలి పీల్చుకుంటే బావుండుననిపిస్తుంది.

దీనికి ఉదాహరణగా - ఒకప్పుడు ప్రయాణం చేస్తుండగా - ఒక ఆసామీ నాదగ్గర దిన పత్రిక తీసుకొని చదువుతున్నాడు, ఇంతలో, అతని పుత్రరత్నం ... ఖరాబు చేయగా, అతని శ్రీమతి ఎలా శుభ్ర పరచడమా అని దిక్కులు చూస్తోంది. అది చూసి యీాయన చటాలున నేకొన్న పత్రికలో మధ్య పేజీ తీసి ''ఊఁ... యిందు'' అని యిచ్చేసేడు... తను డబ్బిచ్చి కొన్న పత్రికలా.. ఆమె అది తీసుకొని ఎత్తి అవతల పారేసింది!

ఏదో చదివి యిచ్చేస్తాడు కదా అని యిస్తే అంత స్వంత పత్రికలా స్వతంత్రిస్తాడను కొనలేదు. కొంతసేపయేక, మరి అవుసరం రాలేదు కాబోలు, మిగిలిన ఆ పేపరును, నాది అని జ్ఞాపకం తెచ్చుగుని యిస్తూవుంటే - నేనే - ''అక్కర్లేదు. మీదగ్గరే వుంచండి. మరో మాటికి పనికి వస్తుంది'' అని అనేసరికి- అతని ముఖం చిన్న బోయిందను కున్నారేమో ! అబ్బే లేందే! మాటాడకుండా మడిచి పక్కని పెట్టుకున్నాడు ! తేంక్సైనా అనలేదు !

కళాకారుల్లో కూడా యిలాటి వారున్నారండోయ్! - ఏనాడో పది పదిహేనేళ్ళనాటి పత్రికల్లో పడిన - ఎవరివో రచనలు, మక్కీకి మక్కీ కాపీ చేసి తమ స్వంత రచనల్లా, తను పేరుతో పంపేవారూ యీ కోవలోకి చెందిన వారే! కర్మం జాలక అవి బయటపడితే, అవమానమే కదా జరుగుతుంది. అది వారికి లెక్కలేదు.. లేదా... అవి కీర్తి శేషులయిన రచయితల వయి వుండో, వాటి సంగతి అందరూ మరచిపోయిన వయితే, బాధే లేదు... సునాయాసంగా రచయితలయి కూర్చుంటారు!

మీరు పోష్టాఫీసుకెళితే, బ్యాంకుకు వెళితే అక్కడ తప్పకుండా యిలాంటి వాళ్లు తారస పడుతూనే వుంటారు. ''ఒక్క సారి పెన్ను యిస్తారా !'' అని అడిగేవాళ్ళు నూటికి తొంభై మంది ... అలాటి వాళ్ళే. కాని అందూ దురుద్దేశంతో రారు. ఆ తొందరలో, మన పని ముగించుగొని - ఆ ఆసామికి పెన్ను యిచ్చేమన్న సంగతి మరిచివదిలి వెళ్ళిపోవడం... తిరిగి మనకి దాని అవసరం వచ్చేక ఆ ఆసామీ జ్ఞాపకానికి వచ్చి, తిరిగి వచ్చి చూసినా అతడు కనిపించక పోడం - దానికి నీళ్ళ ధారపొయ్యాలిసి రావడం, మామూలే! - ఇలాటి వాళ్ళలాటి వాళ్ళంటే- వెంటనే జ్ఞాపకం వచ్చి మనం అడిగితే యింకా రాస్తున్నట్టేనటించి మర్యాదగానే యిచ్చేస్తారు! మనం మరచిపోతే, తను స్వంతంలా జేబులో పెట్టుగుజారిపోతారు! - ఇలాగే వర్షాకాలంలో గొడుగులు సంగతి కూడా ! కొనుక్కునే వాడొకడూ అనుభవించే వాడొకడూ !

దేవుడు గుడి ముంగల వదిలిన చెప్పులూ, రైళ్ళలో విడిచిన చెప్పులూ మనకి చేం వరకూ ఆ భగవంతునిదే భారం !

ఇలా వీళ్ళందరూ యితర్ల వస్తువులను స్వంతం కింద ఉపయోగించుకొని అపహరించే

వారయితే - కొన్ని వస్తువులు అపహరించడానికి వీలుకావు, ఉపయోగించుకోండికే గాని, అలాటి వేవంటే -

వైటింగు రూమ్‌ల్లో పంకాలూ, లైట్లూ, కొళాయీలూ, అద్దె యిళ్ళూ యిలాటివి. అవేగాని తమ స్వంతం అయితే జాగ్రత్తగా వాడుకుంటారు. కాకపోబట్టి, అవుసరం లేకపోయినా, స్వంతం కన్నా ఎక్కువగానే వాడుకుంటారు. అవుసరం తీరినా, ఆ కుళాయి కట్టరు. ఫేన్లు ఆపరు. లైట్లు ఆర్పరు. యిదో రకం.

ఈ బుద్ధే కాస్త ఎక్కువయి ప్రవృత్తి కింద దిగితే అదే దొంగతనం - లేకపోతే - ఏమీ లెక్కలోకి రాదు. పూర్తిగా స్వంతం చేసుకోడం దొంగతనం. కాస్త అనుభవించి వదిలేయడం యీ రకం - అంతే తేడా.

ఏళ్ళ వల్ల పై వాళ్ళకి యిబ్బందే అయినా - ఎవరేమిటి అనుకున్నా - వారు మాత్రం హాయిగా పువ్వులూ, ఆరుకాయలుగా, ఎక్కడికెళ్ళినా యిబ్బంది పడకుండా మహారాజ భోగం అనుభవిస్తూంటారు. వీరిలో యిది ఒక గొప్పతనమే అనాలి! వారిలో ఏదో ఒక శక్తి తాలూకు ప్రభావం మన మీద పని చేయబట్టే, మన వస్తువులనే వారు వారి స్వంత వాటిల్లా ఉపయోగించుకుంటూ వున్నా ప్రత్యక్షంగా చూస్తూ కూడా ఏమీ అనలేక పోతాం. నిజంగా '' అంతా మన స్వంతమే '' అన్న సిద్ధాంతం గల వాళ్లు బ్రతకనేర్చిన వారు అని అంటే ఏం తప్పు లేదనుకుంటా.

★ ★ ★

*(ఢంకా - 12 - 1960)*